నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
తెలంగాణ జిల్లాలు
గురువారం 9, ఏప్రిల్ 2026 పేజీలు:4




# నాడు సబబే అంటిరి.. నేడు అబ్బబ్బే అంటే ఎలా?



- గొల్లపల్లి, చీర్కపల్లి రిజర్వాయర్ల ఉదంతంపై ఎమ్మెల్యే ఆగ్రహం
- గత ప్రభుత్వ హయాంలోనే ఆన్ లైన్ రిజర్వాయర్లకు జీవోలు జారీ
- మాజీ మంత్రులు హరీష్ రావు, నిరంజన్ రెడ్డిలు అంబేద్కర్ చౌక్‌లో ముక్కు నేలకు రాసి వనపర్తి ప్రజలకు క్షమాపణలు చెప్పాలి
- ఎమ్మెల్యే మేఘారెడ్డి

2 లో..



బస్ షెల్టర్ ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం

# శుభ పరిణామం

- మంత్రి వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి
- వనపర్తి బస్టాండ్‌లో అదనపు బస్సు షెల్టర్ ఏర్పాటు

2 లో..



# సభకు సమ్మతి

- హైకోర్టు అనుమతితో గొల్లపల్లిలో భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న హరీష్‌రావు

వనపర్తి ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-ఏప్రిల్ 8:

గొల్లపల్లి, చీర్కపల్లి రిజర్వాయర్లను నిరసిస్తూ నేడు గొల్లపల్లిలో నిర్వహించే భారీ బహిరంగ సభకు హాజరుకానున్న హరీష్ రావుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది.ఈ మేరకు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి స్పందిస్తూ కేసీఆర్ నాయకత్వంలో 14 ఏళ్ల అహింసాయుతంగా పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పక్కనే ఏదుల రిజర్వాయర్ ఉండగా గొల్లపల్లి, చీర్కపల్లి రిజర్వాయర్లు నిర్మిస్తే తాము నష్టపోతామంటూ రైతులు 100 రోజులుగా నిరసన దీక్షలు చేస్తుంటే వారికి సంఘీభావంగా తాము భారీ బహిరంగ సభ నిర్వహించి నిరసన తెలిపేందుకు అనుమతులు తీసుకున్నప్పటికీ పోలీసులు పాలకుల ఒత్తిళ్లకు లొంగి రద్దు చేశారని గుర్తు చేశారు. అయినప్పటికీ తాము రైతుల పక్షాన హైకోర్టుకు వెళ్లి అనుమతి పొందామని రైతులకు న్యాయం జరిగేలా భారీ బహిరంగ సభకు తరలిరావాలని నియోజకవర్గ ప్రజలు, రైతులకు పిలుపునిచ్చారు.



# నాడు సబబే అంటిరి.. నేడు అబ్బబ్బే అంటే ఎలా?

**వనపర్తి ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-ఏప్రిల్ 8:**

గొల్లపల్లి, చీర్కపల్లి రిజర్వాయర్ల నిర్మాణాలు నాడు సబబే అంటూ నేడు ప్రభుత్వం కోల్పోగానే అబ్బబ్బే అలాగేలా అంటూ రైతులను రెచ్చగొడుతూ నీతిమాలిన రాజకీయాలకు తెరలేపిన మాజీ మంత్రులు హరీష్ రావు, నిరంజన్ రెడ్డిలు అంబేద్కర్ చౌక్ లో ముక్కు నేలకు రాసి వనపర్తి ప్రజలకు క్షమాపణలు తెలుపాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి హితవు పలికారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం 10 జూన్ 2015లో మొట్టమొదట జీవో 105 విడుదల చేశారని తెలిపారు. పాలమూరు, రంగారెడ్డి లో భాగం ఏదుల రిజర్వాయర్ 2800 ఎకరాలలో వనపర్తి నియోజకవర్గంలో రిజర్వాయర్ అయ్యిందన్నారు. వనపర్తి నియోజకవర్గానికి ఒక్క ఎకరా కూడా ఆయకట్టు ఇవ్వలేదన్నారు. నేడు గొల్లపల్లి, చీర్కపల్లి రిజర్వాయర్ వద్దంటూ రైతులను రెచ్చగొడుతూ దీక్షల పేరిట పిలిచేటాయన, వచ్చేటాయన ముందు వనపర్తి లోని



అంబేద్కర్ చౌక్ లో ముక్కు నేలకు రాసి వనపర్తి ప్రజలకు క్షమాపణలు చెప్పి వనపర్తికి రావాలని సవాలు చేశారు. ఒక్క ఎకరా పొలం ఇవ్వకపోయినా ఏదుల నుండి నీరు తీసుకుపోవాలనడం అన్యాయమని ఏదుల రిజర్వాయర్ కింద రెగ్యులేటర్ పెడితే కింద ఆయకట్టు మాత్రం రెండు మీటర్ల ఎత్తులో ఉందని, అయినప్పటికీ రెగ్యులేటర్ పెట్టినప్పుడు ఆయకట్టు కూడా ప్రకటించాలి కదా అని ప్రశ్నించారు. నాడు మీరు చేసిన సర్వేలు, జారీ చేసిన జీవోల ప్రకారం రైతులకు సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతుంటే బిఆర్ఎస్ నాయకులు దొంగ పట్టాలు చేసుకుని ప్రభుత్వాన్ని మోసం చేసి బినామీల పేరిట డబ్బులు దొబ్బుకున్న దొంగలతో దొంగ దీక్షలు చేస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రైతుల ఆమోదంతోనే తాము ముందుకు వెళతామని, ఇప్పటికైనా రైతులు వద్దంటే విరమించుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బిల్లులు కడితేనే ఎత్తిపోతలకు విద్యుత్

- రూ.33వేల కోట్లకు పైగా బకాయిలున్నాయి
- నీటి పారుదల శాఖకు ఇంధన శాఖ అల్టిమేటం
- ఎత్తిపోతల పథకాలు ఐరావతంలా మారాయి: ఉప ముఖ్యమంత్రి భట్టి
- ఆచితూచి పంపులు నడపండి: ఉత్తమ్ కుమార్ రెడ్డి


**హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-ఏప్రిల్ 8:**

రూ.33వేల కోట్ల మేర బిల్లులు బకాయి పడ్డారు. ఇకపై బిల్లులు చెల్లిస్తేనే ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ సరఫరా చేస్తాం. లేదంటే ఇవ్వలేం.. అంటూ నీటి పారుదల శాఖకు ఇంధన శాఖ తేల్చిచెప్పింది. ఎత్తిపోతల పథకాల పంపులను ఏ సమయంలో ఆపరేట్ చేయాలి?, బకాయిల చెల్లింపుల అంశంపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో బుధవారం కీలక సమావేశం జరిగింది. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆర్థిక, ఇంధన, నీటపారుదల శాఖ ఉన్నతాధికారులు, ట్రాన్స్‌కో, డిస్కమ్‌ల సీఎం ఎండీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ.. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల దాకే ఎత్తిపోతల పథకాల పంపులు నడిపించాలని, ఆ సమయంలో సౌర విద్యుత్ ఉత్పత్తి అధికంగా ఉంటుందని, తక్కువ ధరకు విద్యుత్ లభిస్తుందని సూచన చేశారు. దీనివల్ల విద్యుత్ సంస్థలపైనా భారం పడదన్నారు. విద్యుత్ సంస్థలు రూ.50 వేల కోట్లకు పైగా అప్పుల్లో ఉన్నాయని, ఇందులో రూ.33,653కోట్లు నీటిపారుదల శాఖ నుంచే రావాలన్నారు. బిల్లులు కట్టకుండా 24 గంటల పాటు విద్యుత్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అధిక ధరకు లభించే కరెంట్‌తో కాకుండా తక్కువ ధరకు లభించే సౌరవిద్యుత్‌తో పంపింగ్ చేసుకోవాలని నవీన్ మిట్టల్ సూచించారు. ఇందుకు ఎత్తిపోతల పథకాల సలహాదారుడు పెంటారెడ్డి బదులిస్తూ.. ఎత్తిపోతల పథకాల్లో వినియోగించే మోటార్లు/పంపులను పగటిపూట నడిపించి రాత్రి పూట ఆపితే పంపులు దెబ్బతింటాయని తెలిపారు. కాళేశ్వరంలోని ప్యాకేజీ-6లో నంది మేడారం పంప్‌హౌస్‌లోని ఓ మోటార్, ప్యాకేజీ-8లో రామగుడులోని పంపులు గతంలో దెబ్బతింటే ఒక్కో పంపు మరమ్మతుకు రూ.25కోట్లు ఖర్చయిందని చెప్పారు. ఇతర పంపులకు, ఎత్తిపోతల పథకాల పంపులకు తేడా ఉందని, 24 గంటల పాటు నిరాటంకంగా ఏడాదంతా పంపులు నడిచినా ఫర్వాలేదు కానీ ఉదయం నడిపి రాత్రి ఆపేస్తే పంపుల్లోని ఇంపెల్లర్‌లు దెబ్బతింటాయని చెప్పారు. అయితే, పంపులు నడిపించాలనుకుంటే బిల్లులు చెల్లించాలని ఇంధన శాఖ స్పష్టం చేసింది. అవసరం ఉన్నా, లేకున్నా ఎత్తిపోతల పథకాలు చేపట్టి, బిల్లులు చెల్లించకుండా వాటిని ఐరావతాల్లా వదిలేసి వెళ్లిపోయారని బీఆర్ఎస్ తీరుపై భట్టివిక్రమార్క ఆక్షేపించారు.

# బస్ షెల్టర్ ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం శుభ పరిణామం

**వనపర్తి ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-ఏప్రిల్ 8:**

వనపర్తి బస్టాండులో అదనపు బస్సు షెల్టర్ ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం శుభ పరిణామమని మంత్రి వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డిలు అన్నారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే పల్లె వెలుగు బస్సులు నిలిపేందుకు బస్టాండ్ ప్రాంగణంలో అదనపు బస్సు షెల్టర్ ఏర్పాటుకు గోనూరు వెంకటయ్య సహకారం మరువలేనిదన్నారు. బుధవారం డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ అధ్యక్షతన అదనపు బస్సు షెల్టర్ ను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో గోనూరు వెంకటయ్య కుటుంబ సభ్యులతో పాటు మహబూబ్నగర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ కవిత ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికులు పాల్గొన్నారు.



# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు రక్షణశాఖ గ్రీన్‌సిగ్నల్

- వీలైనంత త్వరగా శంకుస్థాపన
- ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో టెర్మినల్
- కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, కిషన్‌రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ, (నేటి ఫోకస్ న్యూస్)-ఏప్రిల్ 8:**

ఆదిలాబాద్‌లో విమానశ్రయ నిర్మాణానికి కేంద్ర రక్షణ శాఖ ముందుకు వచ్చిందని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. బుధవారం ఢిల్లీలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న ఎయిర్‌స్ట్రిప్ వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతం కావడంతో శిక్షణ కేంద్రంతో పాటు, పౌర విమానాల సేవల కోసం అభివృద్ధి చేయాలని రక్షణశాఖ ప్రతిపాదించిందని మంత్రి తెలిపారు. సామాన్య ప్రజల కోసం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) టర్మినల్ బిల్డింగ్ నిర్మిస్తుందన్నారు. ఈ నెల 17న.. విమానయాన, రక్షణ శాఖ అధికారులతో కూడని బృందం ఆదిలాబాద్‌లో పర్యటించి ఓఎల్ఎస్ సర్వే చేస్తారని, అనంతరం రన్‌వే ఓరియంటేషన్, మాస్టర్‌ప్లాన్ ఖరారు చేస్తారని వెల్లడించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన అదనపు 450 ఎకరాల భూమిని రాష్ట్రప్రభుత్వం త్వరగా అప్పగించాలని కోరామని, అందుకు ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించిందని తెలిపారు. తెలంగాణకు ముఖద్వారంగా ఉన్న ఆదిలాబాద్‌లో విమానాశ్రయం అందుబాటులోకి వస్తే భవిష్యత్‌లో వాణిజ్యపరంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణకు ఒకే విమానశ్రయం ఉందన్న భావన ప్రజల్లో ఉందని, వారి డిమాండ్‌కు అనుగుణంగా.. విమానశ్రయాల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని చెప్పారు. వరంగల్‌లో మామునూరు విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, మరో 3 నెలల్లో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయబోతున్నామని తెలిపారు.

# పొలిటికల్ అఫైర్స్ కమిటీ అత్యంత కీలకం కాబోతోంది





**-త్వరలో డీసీసీ నూతన భవనానికి శంకుస్థాపన.**

**-వ్యూహరచనతో పార్టీని బలోపేతం చేస్తాం.**

**-డిసిసి అధ్యక్షులు శివసేనారెడ్డి.**

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:

కాంగ్రెస్ పార్టీలో పొలిటికల్ అఫైర్స్ కమిటీ అనేది అత్యంత కీలకం కాబోతోందని డిసిసి అధ్యక్షులు శివసేనారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పిఎసి సమావేశానికి మంత్రి వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ పొలిటికల్ అఫైర్స్ కమిటీ అత్యంత ప్రతిష్టాత్మక వ్యూహంతో నిర్ణయాలు తీసుకుంటూ అధిష్టానంతో అనుసంధానంతో పనిచేస్తుందన్నారు. కమిటీలో 17 మంది సభ్యులు ఉంటారని పార్టీ బలోపేతం కోసం సభ్యులు శక్తివంచన లేకుండా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేస్తూ ఎప్పటికప్పుడు రాజకీయ సమీకరణలను అనుసరిస్తూ వ్యూహాలను కమిటీ ఖరారు చేస్తుందన్నారు. ఏ ఎన్నికలు వచ్చినా టికెట్ల కేటాయింపు, రిజర్వేషన్లు వంటి అంశాలపై కీలక నిర్ణయాలు పార్టీ అంతర్గత వ్యూహరచనతో సీనియర్ నాయకుల అనుభవాన్ని ఉపయోగించుకొని వారిని భాగస్వామ్యం చేస్తామన్నారు. పొలిటికల్ అఫైర్స్ కమిటీ లో ప్రతిపాదించిన ఎజెండా సంస్థ విస్తరణలో భాగంగా బిఎల్ఎ1, బిఎల్ఎ 2 త్వరితగతిన నియమించుకొని ముందుకెళ్తామని తెలిపారు. జిల్లా కేంద్రంలో అతి త్వరలోనే నూతన పార్టీ కార్యాలయానికి పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేతులమీదుగా శంకుస్థాపన చేయించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ డోర్నకల్ గద్వాల రైల్వే లైన్ నాగర్ కర్నూల్, వనపర్తి ప్రజల చిరకాల వాంఛ అన్నారు. రైల్వే ఏర్పాటు కోసం ఎంతగానో శ్రమించానని కేంద్ర ప్రభుత్వం స్పందించి ఏడు కోట్లతో సర్వే చేపట్టిందన్నారు. సర్వే చేసిన ప్రాంతంలోని రైల్వే లైన్ ఏర్పాటు కాకుంటే స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి పాదయాత్ర చేపడతానని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్రప్రసాద్ యాదవ్, శంకర్ ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ లు మాధవి, శ్రీనివాస్ గౌడ్, నాగమణి, సువర్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శులు బ్రహ్మం చారి, విజయలక్ష్మి, ధనలక్ష్మి, నాయకులు కోళ్ల వెంకటేష్, సహదేవ్, నందిమల్ల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా బొమ్మన బోయిన వెంకన్న యాదవ్ నియామకం

తొర్రూర్ నేటి ఫోకస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు ఏప్రిల్ 8

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రానికి చెందిన బొమ్మనబోయిన వెంకన్న యాదవ్ ను కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శిగా టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలనుసారం జిల్లా డిసిసి అధ్యక్షురాలు భూక్య ఉమా నియమించడం జరిగింది. ఈసందర్భంగా వెంకన్న యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు ఉన్నత పదవులు రావాలంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని పేర్కొంటూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసినందుకు ప్రతిష్టానం నన్ను గుర్తించి జిల్లా కార్యదర్శిగా నియమించినందుకు నాపై మరింత బాధ్యత పెరిగిందని తెలుపుతూ పార్టీ అభివృద్ధి కోసం నా వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ పదవి రావడానికి సహకరించిన టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కి,స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి, టిపిసిసి అధ్యక్షురాలు అనుమాండ్ల ఝాన్సీ రెడ్డికి, జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉమకి,జిల్లా,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

## విద్యుదాఘాతంతో మొక్కజొన్న పంట దగ్ధం

**రెండు ఎకరాల్లో పంట పూర్తిగా ధ్వంసం**

**నష్టపరిహారం చెల్లించాలని రైతు వేడుకోలు**

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు ఏప్రిల్ 8



విద్యుదాఘాతంతో ఒక్కసారిగా చెలరేగిన మంటలు రైతు ఆశలను బూడిద చేశాయి. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర గ్రామ శివారులో జరిగిన ఘటనలో రెండెకరాల మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. దీంతో రైతుకు రూ. 1.50 లక్షల నష్టం వాటిల్లింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మైదంశెట్టి మురళి 2 ఎకరాలలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. మరో వారం రోజుల్లో అమ్మకాలు చేపట్టాల్సి ఉంది. బుధవారం మధ్యాహ్నం తన పొలం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో మొక్కజొన్న చొప్పకు అంటుకున్నాయి. దీంతో భారీగా మంటలు వ్యాపించి, రెండెకరాల్లో పంట మొత్తం బూడిద పాలైంది. చుట్టుపక్కల రైతులు ఇచ్చిన సమాచారంతో బాధిత రైతు అక్కడికి వెళ్లి చూసే సరికి పంట మొత్తం అగ్నికి ఆహుతి అయ్యింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నోటికాడికి వచ్చే సమయంలో అగ్నిప్రమాదం రూపంలో నష్టం వచ్చిందని రైతు గగ్గోలు పెడుతున్నాడు. ప్రభుత్వం ప్రకృతి విపత్తుల కింద తమకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి రైతు కోరుతున్నాడు.

# విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు ఏప్రిల్ 8

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని టీఎస్ ఎన్పీడీసీఎల్ కంపెనీ చైర్మన్ ధరావత్ సికిందర్ డిమాండ్ చేశారు.విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఆర్టిజన్, ఆన్ మ్యాన్, స్పాట్ బిల్లర్స్, పీస్ రేట్ కార్మికులు సమ్మె నిర్వహించారు.ఈ సందర్భంగా సికిందర్ మాట్లాడుతూ...ట్రాన్స్కో, జెన్కో, డిస్కంలలో దాదాపు 20 వేల మంది ఆర్టిజన్స్ ఏడేళ్లుగా పని చేస్తున్నారని, అంతకుముందు ఈ కార్మికులందరూ 20 ఏళ్లు కాంట్రాక్టు పద్ధతిలోనే విద్యుత్ సంస్థల్లో పని చేశారని గుర్తు చేశారు. అన్ మ్యాన్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాబట్టి కార్మికుల విద్యార్హతల ఆధారంగా జేఎల్ఎం, జూనియర్ అసిస్టెంట్, సబ్ ఇంజినీర్, ఆఫీస్ సబార్డినేట్ గా కన్వర్షన్ చేయాలని కోరారు. విద్యుత్ శాఖలో ఒకే సంస్థలో ఒకే సర్వీస్ రూల్ అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తొర్రూరు డివిజన్ చైర్మన్ పసుపులేటి మధు, కన్వీనర్ బంధారపు శ్రీనివాస్,కో చైర్మన్ పి నాగరాజు,కో కన్వీనర్ రమేష్,నాయకులు ప్రకాష్ ఖాజాబీ, జ్యోతి, స్వప్న, ఉపేందర్ సునీల్ సత్తార్ బాషా,హరిప్రసాద్, బంధు శ్రీను, రామకృష్ణ, సందీప్, అశోక్, పుల్లయ్య, మధు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు ఏప్రిల్ 8



వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేద్రాలు ఎంతో తోడ్పడుతాయని బాల వికాస కోఆర్డినేటర్ రమ అన్నారు. బుధవారం మండలంలోని చిన్నవంగర గ్రామంలో బాల వికాస అనుబంధ సంస్థ జననికాస ఆధ్వర్యంలో గ్రామ లొ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రమ మాట్లాడారు. దాత సర్పంచ్ ముసుకు ఎల్లమ్మ వారి తండ్రి జ్ఞాపకార్థం చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశామని వేసవి పూర్తి అయ్యేంత వరకు వారు మినరల్ వాటర్ను సప్లై చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ స్వప్న బాలవికాస మెయిన్ కోఆర్డినేటర్ రామ కోఆర్డినేటర్ ఎం సరిత బాలవికాస మహిళలు గ్రామస్తులు సంతోష్, లక్ష్మణ్, నాగమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలి

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు ఏప్రిల్ 8

త్వరలో నిర్వహించనున్న ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చిట్యాల స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం విజయ్ కుమార్ అన్నారు. బుధవారం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో అకాడమిక్ సమీక్షతో పాటు బడిబాట కార్యక్రమంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరూ సహకరించాలని, బడిబాటలో భాగస్వాములై విద్యార్థుల నమోదు పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు అన్ని రిపోర్టులను సమయానికి పూర్తి చేయాలని, విద్యా సంవత్సరం చివరలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించి ప్రోగ్రెస్ కార్డులు అందించాలని తెలిపారు.

కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయుల కృషితో చిట్యాల కాంప్లెక్స్ జిల్లా స్థాయిలో ముందంజలో ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొంతమంది హెచ్ఎంలు, ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీ వేముల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## బొడ్రాయి పునర్నిర్మానంపై విచారణ

పెద్ద వంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు ఏప్రిల్ 8



బొడ్రాయి ఏర్పాటు స్థలంపై తలెత్తిన వివాదం గ్రామంలో ఉద్రిక్తతలకు దారి తీస్తుండగా, అధికారుల జోక్యంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమమైంది. మండలంలోని చిట్యాల గ్రామంలో బొడ్రాయి ఏర్పాటు స్థలం విషయంలో తలెత్తిన వివాదంపై ఎంపీడీవో బోడెపూడి వేణుమాధవ్ బుధవారం విచారణ చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాన్ని సందర్శించిన ఆయన, సర్పంచ్ ఈదురు బుచ్చమ్మ యాకయ్యతో కలిసి ఇరు వర్గాల అభిప్రాయాలను సేకరించారు. గ్రామానికి చెందిన తన్నీరు మధు ఫిర్యాదు నేపథ్యంలో విచారణ అధికారిగా నియమితులైన ఎంపీడీవో, గ్రామస్తులతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన స్థలంలో బొడ్రాయి ప్రతిష్ఠించాలనే దిశగా నిర్ణయం తీసుకున్నారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం శాంతి, సామరస్యాలు అవసరమని సూచించారు. సంప్రదాయాలను గౌరవిస్తూ సంబంధిత శాఖల అనుమతులతో బొడ్రాయి పునః ప్రతిష్ట చేపట్టాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దాసరి మహాలక్ష్మి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సుమలత, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ ఎండీ రహీం తదితరులు పాల్గొన్నారు.

## ఆటిపాముల వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు

నేటి ఫోకస్ న్యూస్ : బామిని రఘుపతి స్టేట్ కోఆర్డినేటర్ ఏప్రిల్ 8



సదాశివపేట పట్టణానికి చెందిన ఆటిపాముల సత్యలక్ష్మి క్రిష్ణ దంపతుల కుమారుడైనా భరత్ చందనల వివాహ మహోత్సవ వేడుకలు ఆనందోత్సాహాల నడుమ స్థానిక బసవ సేవాసదన్ ఫంక్షన్ హాల్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. ఆటిపాముల కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ, నూతన దాంపత్య జీవితాన్ని సుఖశాంతులతో గడపాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ, వివాహం అనేది రెండు మనసులకే కాకుండా రెండు కుటుంబాల కలయిక అని పేర్కొన్నారు. ఇలాంటి శుభకార్యాల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు. కుటుంబ బంధాలు, సాంప్రదాయ విలువలు సమాజ నిర్మాణంలో ఎంతో కీలకమని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీకాంత్ (బుట్ట), వెంకన్నబాబు (లడ్డు), నల్ల సాయి, ప్రేమ్, శ్రవణ్ అఖిల్, సోమ శంకర్ , పి. ఎం. ఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

## సోలిపూర్‌లో ముగిసిన బండలాగుడు పోటీలు





**-గద్వాల ప్రథమ, నల్గొండ ద్వితీయ బహుమతులకు ఎంపిక.**

**-బండలాగుడు పోటీలను ప్రారంభించిన మాజీ జెడ్పిటిసి తీనేటి రవీందర్ రెడ్డి, సర్పంచ్ సింధు శేఖర్ రెడ్డి**

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్

వనపర్తి జిల్లా ఖిల్లా గణపురం మండలంలోని సోలిపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు ప్రశాంతంగా ముగిశాయి. గ్రామంలో సుప్రసిద్ధ ఆలయంగా వెలుగొందుతున్న శ్రీ లక్ష్మీనరసింహ యోగానంద సద్గురు స్వామి వారి సప్తాహ సహిత ఆరాధన ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన అంతర్రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలకు వనపర్తి జిల్లాతో పాటు గద్వాల, నల్గొండ జిల్లాల నుంచి ఐదు జతల ఎద్దులు బండలాగుడు పోటీలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి తేనేటి రవీందర్ రెడ్డితో పాటు గ్రామ సర్పంచ్ సింధు శేఖర్ రెడ్డిలు ఎద్దుల బండ్ల పోటీలను ప్రారంభించారు. ఈ మేరకు నిర్వహించిన పోటీలలో గద్వాల జిల్లా రాజోలి మండలం పచ్చర్ల గ్రామానికి చెందిన సంపత్ కుమార్ రెడ్డి ఎద్దులు 2871 అడుగుల దూరం లాగి మొదటి బహుమతికి ఎంపికై 40వేల నగదు అందుకున్నారు. అలాగే నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం కొప్పోరు గ్రామానికి చెందిన సత్యనారాయణ రాజు ఎద్దులు 25 34 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతికి ఎంపికై 30 వేల నగదును అందుకున్నారు. ఆ తర్వాత వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం పెద్ద దగడ గ్రామానికి చెందిన గోపాలకృష్ణ కి చెందిన ఎద్దులు 21 0 6 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతిగా 20వేల నగదు, అదే గ్రామానికి చెందిన మల్లికార్జున స్వామి ఎద్దులు 1800 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతిగా 17,500 పానగల్ మండలం దవాసి పల్లి కి చెందిన శ్రీ వర్ధన్ రెడ్డి ఎద్దులు 1261 అడుగుల దూరం లాగి 5వ బహుమతిగా 12,500 నగదును అందుకున్నారు. ఈ బండలాగుడు పోటీలలో పాల్గొని విజయం సాధించిన వృషభ రాజుల యజమానులకు మాజీ జెడ్పిటిసి రవీందర్ రెడ్డి, సర్పంచ్ సింధు శేఖర్ రెడ్డి ఉప సర్పంచ్ నవీన్ రెడ్డి మాజీ ఎంపీపీ వెంకటయ్యలు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన బాలకృష్ణారెడ్డి రామకృష్ణారెడ్డి వెంకటేశ్వరరావు ఆగారం ప్రకాష్ రామ్ రెడ్డి సతీష్ ఖలీల్ శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



